క్లుప్తంగా

నేడే చివరి అవకాశం

ఖానాపురం : నూతనంగా పోడు పట్టాలు పొందిన గిరిజన రైతులు రైతుబంధు సాయం కోసం సోమవారం సాయంత్రం వరకు తమ వివరాలు అందించాలని మండల వ్యవసాయ అధికారి బోగ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని అశోక్‌నగర్, ధర్మరావుపేట క్లస్టర్ల పరిధి నుంచి మరో 150మంది పోడు రైతులు ఆధార్, బ్యాంక్ ఖాతా పుస్తకాల జిరాక్స్‌లు అందించాల్సి ఉందన్నారు. వివరాలు అందిస్తేనే రైతుల ఖాతాల్లో రైతుబంధు జమ అవుతుందని తెలిపారు. వివరాలు అందించకపోతే రైతు బంధు సాయం కోల్పోవాల్సి వస్తోందన్నారు. వివరాలు అందించని రైతులు ఆయా గ్రామాల పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారులకు అందించాలని సూచించారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

చెన్నారావుపేట : రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వాటిని వినియోగించుకోవాలని వ్యవసాయ అధికారి సూర్యనారాయణ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 7వ తేదీ వరకు జీలుగ విత్తనాలు అందించే సబ్సిడీ ముగుస్తుందన్నారు. అలాగే కందులు, మిని కిట్స్ ఆర్పీజీ-176, ఎల్లార్జి-52 రకాలు మిని కిట్స్(చిరు సంచులు) అందుబాటులో ఉన్నాయన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



చెన్నారావుపేట : మండలంలోని ఎల్లాయిగూడెం గ్రామానికి చెందిన గౌడ సంఘం కుల పెద్ద గంధం బుచ్చిరాములు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మంచాల సదయ్య, చిప్ప ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమక్షంలో ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అరాచక పాలనకు అంతమొందించే సమయం ఆసన్న మైందన్నారు. కార్యకర్తలు పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని తెలిపారు.

ఆర్థికసాయం



చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేటకు చెందిన కిడ్నీ వ్యాధి బాధితురాలు పొన్నాల ఎల్లమ్మకు స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఆదివారం రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. బుర్ర సుదర్శన్‌గౌడ్, మొగిలి రమాదేవి కేశవరెడ్డి, మజ్జిగ రాంబాబు, దేవ్‌సింగ్, రవీందర్ ఉన్నారు. అలాగే కుటుంబ అవసరాల కోసం దాతలు సహకరించాలని బాధితులు కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


వల్లె శ్రీనివాస్


కుమారస్వామి

ఖానాపురం : మండలంలోని ధర్మరావుపేట గ్రామంలో శ్రీకృష్ణ యాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వల్లె శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా మేకల కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా గాలి కుమారస్వామి, సహాయ కార్యదర్శిగా జంగిల్ రమేష్, కోశాధికారిగా కర్రె రమేష్, ముఖ్య సలహాదారులుగా వల్లె వెంకన్న, జంగిల్ వెంకన్న, వల్లె ఎర్ర నర్సయ్య, కొండ ఆంబయ్య ఎన్నికయ్యారు.

ముదిరాజ్ యూత్ కమిటీ..

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లి గ్రామ ముదిరాజ్ యూత్ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. యూత్ అధ్యక్షుడిగా పొన్నం రాజు, ఉపాధ్యక్షుడిగా జటబోయిన ప్రశాంత్, కార్యదర్శిగా ఓరుగంటి చిన్న దేవేందర్, సహాయ కార్యదర్శిగా హంస కృష్ణ, కోశాధికారిగా జటబోయిన శివ, సభ్యులుగా ఓరుగంటి రమేష్, మండల రాజు, హంస ధర్మప్రసాద్, రాసమల్ల అన్వేష్, బోళ్ల శ్రీకాంత్, కీసరి నిఖిల్, జటబోయిన స్వామి, ఓరుగంటి పెద్ద దేవేందర్ ఎన్నికయ్యారు.

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం



వర్ధన్నపేట : ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న 9 ట్రాక్టర్లను ఆదివారం ఉదయం స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆకేరు వాగు నుంచి వరంగల్ నగరానికి ఇసుకను ట్రాక్టర్లలో రవాణా చేస్తుండగా కట్ర్యాల శివారు వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. అనుమతి లేకుండా ఇసుక, మొరం, మట్టి అక్రమ రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వామ్మో.. ఆశాలపల్లి రోడ్డు

- అడుగడుగునా గుంతలు..
- ప్రయాణికులకు తప్పని అవస్థలు
- మరమ్మతు చేపట్టాలని వేడుకోలు



ఆశాలపల్లిలో ధ్వంసమైన బీటీ రోడ్డు

సంగెం : అడుగడుగునా గుంతలు.. అవస్థలు పడుతున్న ప్రయాణికులు.. బీటీ తేలిపోయి గోతులు పడ్డా పట్టించుకొని అధికారులు.. దీంతో ఆశాలపల్లి రోడ్డుపై ప్రయాణమంటే ప్రజలు భయపడుతున్నారు.. మండలంలోని కాపులకనిపర్తి గ్రామం నుంచి ఆశాలపల్లి, ఆశాలపల్లి నుంచి వరంగల్-మహబుబాబాద్ ప్రధాన రహదారి ఆశాలపల్లి క్రాస్ రోడ్ వరకు గల బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసమై నరకప్రాయంగా మారింది. కాపులకనిపర్తి ప్రధాన రోడ్డుపై ప్రభుత్వ పాఠశాల సమీపంలో లోలెవల్ కాజ్‌వే స్థానంలో నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంతో రహదారిని ఆశాలపల్లి మీదుగా మళ్లించారు. దీంతో నెక్కొండ, మహబుబాబాద్, పర్వతగిరి వైపునకు వెళ్లే భారీ వాహనాలు, ఇతర వాహనాలన్ని వయా ఆశాలపల్లి మీదుగా మళ్లించారు. దీంతో మాములుగా ఉన్న రోడ్డు భారీ వాహనాల తాకిడి తట్టుకోలేక పూర్తిగా ధ్వంసమై గుంతలు ఏర్పడ్డాయి. దీంతో అటుగా వెళ్లే ప్రయాణికులకు ఈ దారి నరకప్రాయంగా మారిందని ఆందోళన చెందుతున్నారు. అంతేగాక వానాకాలంలో నీటితో గుంతల లోతు తెలియక ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ధ్వంసమైన రోడ్డుకు మరమ్మతులు చేపట్టడం లేదా రెన్యూవల్ చేసి ప్రజల అవస్థలు తీర్చాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.



గ్రామ ప్రధానకూడలిలో రోడ్డు దుస్థితి

రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది



మా ఊరికి వచ్చే రెండువైపులా రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. కాపులకనిపర్తి నుంచి ఆశాలపల్లికి, గ్రామం నుంచి క్రాస్ రోడ్డు వరకు ఇటీవల భారీ గుంతలు పడ్డాయి. ఈ గుంతలను గమనించక పలువురు పడిపోతున్నారు. రోడ్డు బాగుచేసి ఇబ్బందులు లేకుండా చూడాలి.అలాగే మా ఊరు మీదుగా బస్సులు నడిపించాలి.

- పిట్టల భిక్షపతి, ఆశాలపల్లి

ప్రతిపాదనలు చేశాం..

కాపులకనపర్తి నుంచి ఆశాలపల్లి వరకు రోడ్డు నిర్మాణానికి రూ.65లక్షలు మంజూరయ్యాయి. ఇది టెండర్ స్టేజీలో ఉంది. టెండర్ పూర్తికాగానే పనులు ప్రారంభిస్తారు. ఆశాలపల్లి క్రాస్ రోడ్ నుంచి ఆశాలపల్లి గ్రామం మీదుగా రామచంద్రాపురం వరకు రూ.1.78కోట్లతో ప్రతిపాదనలు పంపించాం.

- అభిరామ్, పీఆర్ ప్రత్యేక ఏఈ

మద్యం తాగి వాహనం నడుపొద్దు



డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న సీఐ సదన్‌కుమార్

వర్ధన్నపేట : మద్యంతాగి వాహనం నడపొద్దని నిబంధనలకు విరుద్ధమని వర్ధన్నపేట సీఐ సదన్‌కుమార్ అన్నారు. ఆదివారం రాత్రి వర్ధన్నపేట-జఫర్‌గడ్ రోడ్డుపై డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను తప్పకుండా పాటించాలన్నారు. వాహనం వెంట సంబంధిత పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. విధిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. అదే విధంగా మద్యం తాగి వాహనం నడిపితే రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని, నడిపే వారి ప్రాణాలకే కాకుండా రోడ్డుపై వెళ్తున్న వారి ప్రాణాలకు సైతం ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ఈ తనిఖీల్లో వర్ధన్నపేట సెకండ్ ఎస్సై మంగ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తప్పిపోయిన వృద్ధుడికి 'ఆసరా'



సాయం అందజేస్తున్న సర్పంచ్ బాలిరెడ్డి

గీసుకొండ : గ్రామం నుంచి కొన్ని నెలల క్రితం తప్పిపోయి భద్రాద్రి కొత్తగూడేనికి చేరుకున్న వృద్ధుడి సమాచారం తెలుసుకుని అతడిని ఆత్మీయంగా పలకరించి నేనున్నానంటూ భరోసా ఇచ్చారు.. మరియపురం సర్పంచ్ అల్లం బాలిరెడ్డి. గీసుకొండ మండలం మరియపురం గ్రామానికి చెందిన కొంపెల్లి లక్ష్మీనర్సయ్య అనే 90 ఏళ్ల వృద్ధుడు కొన్ని నెలల క్రితం సింగరేణి రైలెక్కి భద్రాద్రి కొత్తగూడెం స్టేషన్‌లో దిగడంతో తప్పిపోయి వచ్చిన అతడిని అక్కడి పోలీసులు స్థానిక శ్రీజ్యోతి అనాథ ఆశ్రమం వారికి అప్పగించారు. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ ప్రతినెలా అతడికి వచ్చే ఆసరా పింఛన్‌ను ఆశ్రమం వారికి పంపిస్తున్నారు. కాగా ఆదివారం ఆశ్రమానికి వెళ్లి వృద్ధుడిని పలకరించి అతడి యోగక్షేమాలను తెలుసుకోవడంతో పాటు ఏ లోటు రానియొద్దని తాను అన్ని విధాల అండగా ఉంటానని సర్పంచ్ భరోసా ఇచ్చారు. అలాగే ఆశ్రమానికి రూ.50 వేల ఆర్థికసాయం అందించారు. మరియపురం వాసి గోపు లూర్దు మర్రెడ్డి, నల్లబెల్లి ఎంపీఓ కూచన ప్రకాశ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నర్సంపేట: పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని 19వ వార్డుకు చెందిన రాధారపు వీరమ్మ ఆదివారం మృతి చెందారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు వీరమ్మ మృతదేహంపై పూలమాల వేసి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి కౌన్సిలర్ ములుకల వినోదసాంబయ్య, మాజీ ఎంపీటీసీ కాట ప్రభాకర్, నాయకులు రాధారపు ప్రవీణ్, రాజేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

బుధరావుపేటలో..

ఖానాపురం : మండలంలోని బుధరావుపేట గ్రామానికి చెందిన ఆర్ఎంపీ మురళీ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. మురళీ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, బత్తిని శ్రీనివాస్‌గౌడ్ పరామర్శించారు. సర్పంచ్ కాస ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీ సుభాన్‌బీ, వెంకటనర్సయ్య, ఎస్‌కె. మౌళానా, యాకుబ్‌పాష, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనాభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి



క్షీరాభిషేకం చేస్తున్న సర్పంచ్, గిరిజనులు

ఖానాపురం : గిరిజనుల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని సర్పంచ్ బాలకిషన్ అన్నారు. ఈ మేరకు మండలంలోని నాజీతండాలో గిరిజనులకు పోడు పట్టాలు అందించడంతో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి చిత్రపటాలకు ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా పోడు సాగు చేసుకొని జీవిస్తున్న గిరిజనులకు అండగా కేసీఆర్ నిలిచాడన్నారు. కార్యక్రమంలో గిరిజనులు నరేష్, తండావాసులు పాల్గొన్నారు.

11న 'తిరుగు పండుగ'

రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామంలో ప్రతిష్ఠించిన శ్రీసీతా సుందర రామచంద్రస్వామి దేవాలయంలో ఈనెల 11న తిరుగుపండగను నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు రామకృష్ణమాచార్యులు తెలిపారు. ఆదివారం గ్రామంలోని ఆలయం వద్ద జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, సర్పంచ్ లేతాకుల సుమతియాదవరెడ్డితో కలిసి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణం, ధ్వజస్తంభ ఏర్పాటుకోసం గ్రామస్తులు సమకూర్చిన డబ్బుల్లో మిగులుగా ఉన్న రూ.15లక్షలు బ్యాంక్‌లో జమచేసి ఆలయ అర్చకుడికి జీతంగా ఇచ్చేందుకు తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈనెల 11న నిర్వహించే పూజా కార్యక్రమాల్లో గ్రామస్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గాడిపెల్లి వెంకన్న, పీఏసీఎస్ డైరెక్టర్ గబ్బెట యాకయ్య, పైడిపెల్లి భీమారెడ్డి, గూడెల్లి వెంకన్న, బొమ్మినేని బుచ్చిరెడ్డి, బండ యాదగిరి, బుచ్చిరెడ్డి, గూడెల్లి వెంకటయ్య, సుధాకర్, ఎల్లస్వామి, పరుపాటి రాజు, పరుపాటి రవీందర్ రెడ్డి, భిక్షపతి, రాములు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమ గాయకుడికి నివాళి



చెన్నారావుపేట: నివాళులర్పిస్తున్న నాయకులు



సంగెం: నివాళులర్పిస్తున్న ఎంపీపీ తదితరులు

చెన్నారావుపేట : తెలంగాణ ఉద్యమ గాయకుడు, ప్రజా కళాకారుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ మృతి పట్ల బీఆర్ఎస్ యువ నాయకుడు కంది కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఆదివారం నివాళులర్పించారు. గ్రామ పెద్ద దేవదాసు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నర్మెట్ట సాంబయ్య, పసునూరి యాకూబ్, సామ్యేల్, రవి, తీగెల అశోక్, రాజు, రాజేందర్, వెంకటస్వామి, కిరణ్, సాగర్, అనిల్, సుదర్శన్ తదితరులు ఉన్నారు.

సంగెం : తెలంగాణ ఉద్యమ కళాకారుడు సాయిచంద్ ఆత్మ శాంతించాలని కోరుతూ మండలంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం ఎంపీపీ కళావతి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గుండేటి బాబు పూలతో శ్రద్ధాంజలి ఘటించారు. ఎంపీటీసీ మల్లయ్య, నాయకులు కోడూరి సదయ్య, గుండేటి కుమారస్వామి, పులి రాజశేఖర్, పేరాల లక్ష్మీనారాయణ, మెట్టుపల్లి కొమురయ్య, బొట్ల రమేష్, శ్రావణ్, అంజనేయులు తదితరులు ఉన్నారు.

గ్రామదేవతలకు జలాభిషేకం

శాయంపేట : వరుణ దేవా కరుణించవా.. అంటూ మండలంలోని పత్తిపాక గ్రామంలో రెడ్డి సంఘం మహిళలు, రైతులు గ్రామ దేవతలకు ఆదివారం నీటితో అభిషేకం చేశారు. సంఘం ఆధ్వర్యంలో మహిళలు తొలుత గ్రామ దేవతలకు పూజలు చేశారు. అనంతరం బిందెలతో నీళ్లు తీసుకొచ్చి అభిషేకం చేశారు. వర్షాకాలం మొదలై నెల గడుస్తున్నా వర్షం కురవకపోవడంతో విత్తనాలు మొలవక పత్తి గింజలు ఎండిపోతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండి రైతులు సుభిక్షంగా ఉండాలని గ్రామదేవతలను కోరుకున్నారు.

'జనగర్జన'కు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



రాయపర్తి: సభకు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు



ఖానాపురం: సభకు వెళ్తున్న కాంగ్రెస్ శ్రేణులు

చెన్నారావుపేట : ఖమ్మం జిల్లాలో నిర్వహించిన జనగర్జన సభకు మండలంలోని ఆయా గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో ఆదివారం తరలివెళ్లారు.

పర్వతగిరి నుంచి..

పర్వతగిరి : ఖమ్మంలో నిర్వహించిన జనగర్జన భారీ బహిరంగ సభకు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం తరలివెళ్లారు. ఈ మేరకు వాహనాలను పార్టీ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పర్వతగిరి మండల ప్రజా పరిషత్, గ్రామపంచాయతీలపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని అన్నారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్‌రావు, పర్వతగిరి ఎంపీటీసీ బొట్ల మహేంద్ర, తురుకుల సోమవారం ఎంపీటీసీ సరోజనలచ్చునాయక్, రాంచందర్, రాణాప్రతాప్, మండల నాయకులు పాల్గొన్నారు.

ఖానాపురం నుంచి..

ఖానాపురం : మండల వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు ఖమ్మంలో నిర్వహించిన బహిరంగ సభకు తరలివెళ్లారు. నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాల్లో వెళ్లారు.



సభకు వెళ్తున్న కొత్తూరు గ్రామ నాయకులు



పర్వతగిరిలో..

రాయపర్తి నుంచి..

రాయపర్తి : ఖమ్మంలో నిర్వహించిన రాహుల్‌గాంధీ జనగర్జన సభకు మండలకేంద్రంతోపాటు ఆయా గ్రామాల నుంచి కాంగ్రెస్ శ్రేణులను ఆదివారం తరలి వెళ్లినట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల ప్రభాకర్ తెలిపారు. నాయకులు పెండ్లి మహేందర్ రెడ్డి, సరికొండ కృష్ణారెడ్డి, మచ్చ నీలయ్య, శ్రీనివాస్, రాజు, గారె చిన్నసాయిలు, గారె వెంకన్న తరలివెళ్లారు.



చెన్నారావుపేట: జనగర్జన సభకు తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

సమస్యల వలయంలో ఆరోగ్య కేంద్రం

- నీళ్లు ఉండవు.. కరెంట్ రాదు
- అరకొర సిబ్బంది.. చెట్ల కిందే సమీక్షలు
- నిధులు ఉన్నా.. పరిష్కారం సున్నా..



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చెన్నారావుపేట

చెన్నారావుపేట : రోగాలను నయం చేసే ఆరోగ్య కేంద్రం పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. అనేక ఇబ్బందులు పడుతు వైద్యసిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. రోగులు అవస్థలు పడుతున్నారు. ఆశ్చర్యమేమిటంటే నిధులు ఉన్నా.. పనులు చేపట్టడం లేదు. చెన్నారావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దీన స్థితి నుంచి ఎప్పుడు బయటపడుతుందోనని ఉద్యోగులు, రోగులు ఎదురు చూస్తున్నారు..

చెన్నారావుపేట పీహెచ్‌సీ పరిధిలో 11ఉప కేంద్రాలున్నాయి. 40గ్రామ పంచాయతీల్లోని ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నారు.రోజుకు సుమారుగా 100మంది రోగులకు ఓపీ సేవలు అందిస్తున్నారు. ఆస్పత్రిలో గర్భిణులకు పరీక్షలు, బీపీ, షుగర్, ఆరోగ్య మహిళ, టీబీ, కుష్టు వ్యాధి, పాము, తేళ్లు, కుక్కలు, కోతులు కరిచిన, బోదకాలు, ఇలా అనేక రకాల వైద్యసేవలు అందిస్తున్నారు.

సమస్యలతో సతమతం..

ఆస్పత్రిలో ప్రధాన సమస్య నీటి, కరెంట్ సమస్య వేధిస్తుంది. నీరు లేక మరుగుదొడ్లు, బాత్‌రూం వాడకంలో లేకుండా నిరుపయోగంగా వదిలేశారు. అంతేకాకుండా వైద్యసేవలు అందించే సమయంలో ల్యాబ్‌లో పరికరాలు, పలు రకాల వస్తువులు శుభ్రం చేసుకోవడానికి నీళ్లు రావు. తాత్కాలికంగా కాంటిజెంట్ వర్కర్‌గా ఏర్పాటు చేసుకున్న సాంబలక్ష్మి సమీపంలోని ఓ ఇంటి నుంచి బకెట్లతో నీరు తెచ్చి పెడుతుంది. అలాగే విద్యుత్ సమస్యలు డాక్టర్, స్టాఫ్ నర్స్, మందుల గదిలో తప్ప ఎక్కడ కరెంట్ సౌకర్యం ఉండదూ. పేషెంట్ల గది, ల్యాబ్‌లో కరెంట్ సౌకర్యంలో లేక, ఫ్యాన్‌లు పనిచేయకపోవడంతో ఆరుబయటనే రోగులకు వైద్యం అందిస్తున్నారు.

అభివృద్ధి పనులకు రూ.7 లక్షలు మంజూరు



చెట్ల కిందే సిబ్బందితో మాట్లాడుతున్న సీహెచ్‌ఓ

ఆస్పత్రిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా గతేడాది రూ.7 లక్షల నిధులు మంజూరయ్యాయి. సంబంధిత ఇంజనీర్‌కు చెప్పినప్పటికి వచ్చి పనులు పరిశీలించి వెళ్లిపోయారు. కానీ ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే విద్యుత్ సమస్య కోసం ఎలక్ట్రిషియన్ వచ్చిన మరమ్మతులు చేసినట్లు చేసి అంతా బాగుందని వెళ్లిపోయారు. రెండు రోజులలోనే కరెంట్ సమస్య మళ్లీ మొదటికి వచ్చిందని తెలిపారు. 6నెలలుగా నీటి సమస్య, కరెంట్ సమస్య ఉందని చెప్పిన పట్టించుకోవడం లేదని సిబ్బంది ఆరోపిస్తున్నారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

40గ్రామ పంచాయతీలకు వైద్యసేవలు అందిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మసిస్ట్ లేరు. ల్యాబ్ టెక్నీషియన్ కూడా ఇటీవలే వచ్చారు. ఆస్పత్రిలో ఫార్మసిస్ట్, ఒక సూపర్‌వైజర్, హెల్త్ అసిస్టెంట్‌లు నాలుగు, ఆఫీస్ సబార్డినేట్ ఒకరు, ఏఎన్ఎంలు ఐదుగురు, సెకెండ్ ఏఎన్ఎం-1, ఆశ వర్కర్లు-11 ఇతర సిబ్బందిని నియమించాల్సిన అవసరముంది.

చెట్ల కిందనే సమావేశాలు

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న మార్గదర్శకలు, నిత్యం సిబ్బంది చేస్తున్న విధులపై, అందిస్తున్న సేవలపై అందించాల్సిన సేవలపై సమావేశాలు, రివ్యూ మీటింగ్‌ల కోసం సిబ్బందితో సమీక్ష జరుపుతుంటారు. కానీ సమావేశ గది లేకపోవడంతో చెట్ల కిందనే కూర్చోని సలహాలు, సూచనలిస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



నిత్యం ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్న ఆస్పత్రిలో నీటి, విద్యుత్ సమస్య తీవ్రంగా వేధిస్తుంది. అందరూ మహిళ ఉద్యోగులే.. రోగులు కూడా ఆస్పత్రికి వస్తు ఉంటారు. కరెంట్ సౌకర్యం లేకపోవడంతో కొన్ని సేవలు అందించలేకపోతున్నాం. రూ.7లక్షల నిధులు ఉన్న సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఉన్నతాధికారులు, పాలకులు ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి.

-డాక్టర్ సరోజ, పీహెచ్‌సీ, చెన్నారావుపేట

కేఎంటీపీ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి



గీసుకొండ : జిల్లాలోని గీసుకొండ-సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు (కేఎంటీపీ) భూ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గట్టికొప్పుల రాంబాబు కోరారు. హనుమకొండలోని హరిత హోటల్‌లో ఆదివారం ఆయన కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. పార్కు కోసం భూమి ఇచ్చిన ప్రతీ రైతు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఎకరానికి వంద గజాల ఇంటి స్థలం ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చి నెరవేర్చలేదని తెలిపారు. కేంద్ర మంత్రి స్పందించి సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని రాంబాబు తెలిపారు.